సాక్షి
సూర్యాపేట

శనివారం । 4 । నవంబర్ । 2023



'మద్దతు' సరిపోతలేదు
నల్లగొండలోని ఐకేపీ కేంద్రంలో 'సాక్షి' నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో రైతులు తమ కష్టాలను చెప్పకున్నారు. - IIలో



పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు
కార్తీకమాసం సందర్భంగా పలు పుణ్య క్షేత్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. - IIలో



గంజాయి తాగుతున్న..
గంజాయి తాగుతున్న ఏడుగురు యువకులను కోదాడ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. - IIలో

న్యూస్‌రీల్

నేడు నీటి సరఫరాకు అంతరాయం

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీకి నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ ఎయిర్‌వాల్వ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తెల్లవీరప్పగూడెం, అడివిదేవులపల్లి వద్ద డ్యామేజ్ చేయడం వల్ల శనివారం పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ విషయమై పోలీసులు కూడా దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



ఆరోగ్య సూత్రాలు వివరిస్తున్న ఆరోగ్య భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగాచార్యులు

చిలుకూరు: విద్యార్థులు నిత్యం ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆరోగ్య భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, డాక్టర్ ఎస్‌సీ రంగాచార్యులు అన్నారు. శుక్రవారం చిలుకూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తెల్లవారుజామున 5.30 గంటల లోపు నిద్ర లేవాలన్నారు. ఉదయం కనీసం అరలీటర్ నీరు తాగడం వల్ల రోగాలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. అదేవిధంగా యోగా ట్రిప్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో సిరికొండ అనంతకృష్ణమాచార్యులు, పృథ్వీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 32,187 బస్తాల ధాన్యం వచ్చిందని, కాంటాలు, ఎగుమతులు ఆలస్యం కావడంతో మార్కెట్ యార్డుకు శనివారం, ఆదివారం సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ శుక్రవారం తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డు తిరిగి సోమవారం యథావిధిగా నడుస్తుందని పేర్కొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేకార్చనలు, నిత్యహోమం, మూలవిరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుఫర్కపూజ, మాంగల్యధారణ జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఊంజలి సేవ



అద్దాల మండపంలో అమ్మవారికి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవ కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజలి సేవ చేపట్టారు. ఇక ప్రధానాలయంలో నిత్య కైంకర్యాలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం చేపట్టి అర్చన, అభిషేకం చేశారు. అలాగే ఆలయ ముఖమండపం, ప్రాకార మండపంలో శ్రీ సుదర్శనహోమం, నిత్యకల్యాణం, జోడు సేవ తదితర కైంకర్యాలు గావించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

తొలిరోజు..16



తుంగతుర్తిలో నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) అభ్యర్థి ఈదుల వీరపాపయ్య



కోదాడలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ కార్యాలయం వద్ద కేంద్ర బలగాల బందోబస్తు

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల.. నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

- 9 నియోజకవర్గాల్లో 16 నామినేషన్లు దాఖలు
- మూడు నియోజకవర్గాల్లో బోణీ కాలేదు
- ఆలేరులో కాంగ్రెస్ నుంచి బీర్ల అయిలయ్య నామినేషన్
- మిగతా చోట్ల ఫార్వర్డు బ్లాక్, ప్రజావాణి, బీఎల్ఎఫ్, యుగతులసి, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు

1వ రోజు – నియోజకవర్గాల వారీగా దాఖలైన నామినేషన్లు

నియోజకవర్గం	నామినేషన్లు
నల్లగొండ	2
కోదాడ	1
సూర్యాపేట	1
మునుగోడు	3
నాగార్జునసాగర్	1
నకిరేకల్	3
ఆలేరు	2
తుంగతుర్తి	1
మిర్యాలగూడ	2
భువనగిరి	-
హుజూర్‌నగర్	-
దేవరకొండ	-

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు శుక్రవారం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో అన్ని నియోజకవర్గాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాలకు గాను 9 సెగ్మెంట్లలో మొదటి రోజు 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మూడు నియోజకవర్గాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఆలేరు నియోజకవర్గంలో ప్రధాన పార్టీ అయిన కాంగ్రెస్ అభ్యర్థిగా బీర్ల అయిలయ్య నామినేషన్ వేశారు. మిగతా 15 నామినేషన్లలో ఎక్కువగా చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులవి ఉన్నాయి. కోదాడ నియోజకవర్గం నుంచి ఎన్ఆర్ఐ జలగం సుధీర్ స్వతంత్ర అభ్యర్థిగా ఆన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేశారు. అయితే, ఆయన స్వయంగా వచ్చి నామినేషన్ పత్రాలపై రిటర్నింగ్ అధికారి ఎదుట సంతకం చేసి అందజేస్తేనే పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

నియోజకవర్గాల వారీగా..

- నల్లగొండ నియోజకవర్గంలో మొదటి రోజు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఆలిండియా ఫార్వర్డు బ్లాక్ అభ్యర్థి పిల్లి రామరాజుయాదవ్ తరపున ఆయన సోదరుడు పిల్లి కృష్ణంరాజు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా సూర్యాపేటకు చెందిన మారం వెంకట్‌రెడ్డి నామినేషన్ పత్రాలను ఆర్‌వోకు అందజేశారు.
- కోదాడ నుంచి ప్రజావాణి తరఫున లింగిడి వెంకటేశ్వర్లు నామినేషన్ దాఖలు చేశారు
- సూర్యాపేటలో కూడా ప్రజావాణి పార్టీ నుంచి లింగిడి వెంకటేశ్వర్లు నామినేషన్ వేశారు.
- మునుగోడు నియోజకవర్గం నుంచి ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అందులో బేరి వెంకటేశం, మాదగోని వెంకటేశ్వర్లు, బుషిపాక వెంకటయ్య ఉన్నారు.
- నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గాదె సైదిరెడ్డి నామినేషన్ వేశారు.
- నకిరేకల్ నుంచి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. అందులో స్వతంత్ర అభ్యర్థులు రేఖల సైదులు, చినేని లక్ష్మయ్య ఉన్నారు. బీఎల్ఎఫ్ పార్టీ తరఫున నూనె వెంకటస్వామి నామినేషన్ దాఖలు చేశారు.
- ఆలేరులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల అయిలయ్యతోపాటు యుగ తులసి పార్టీ తరఫున కందాడి మహిపాల్ నామినేషన్ దాఖలు చేశారు.
- తుంగతుర్తి నియోజకవర్గంలో బీఎల్ఎఫ్ అభ్యర్థిగా ఈదులూరి వీరపాపయ్య నామినేషన్ వేశారు.
- మిర్యాలగూడలో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. మల్లిడి వెంకట్‌రాంరెడ్డితోపాటు ఉషానాయక్ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు.
- భువనగిరి, దేవరకొండ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో మొదటి రోజు ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదు.

పటిష్ట బందోబస్తు

నామినేషన్ల సందర్భంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల వెంట వచ్చిన జనాలు, వాహనాలను వంద మీటర్ల దూరంలోనే ఆపేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అధికారులు నామినేషన్లను స్వీకరించారు.

హెల్ప్ డెస్క్‌ను వినియోగించుకోవాలి

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, పక్కన ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు సమయంలో ఏవైనా సందేహాలు ఉంటే ఆర్‌ఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్‌ను ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు అఫిడవిట్ సమర్పించాలని, అందులోని ప్రతి కాలమ్‌ను నింపాలన్నారు. ఈనెల 10 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 13న స్క్రూట్నీ, 15న విత్ డ్రాలు ఉంటాయని చెప్పారు. నామినేషన్ పత్రాలు అందించే సమయంలో ప్రతి అభ్యర్థి ఫామ్‌- 26 అందించాలన్నారు. ఈ అఫిడవిట్‌లో ఆస్తులు, కేసులు, ఇతర వివరాలు పొందుపర్చాలని పేర్కొన్నారు. నామినేషన్ వేసే సమయంలో ఓటు గుర్తింపు కార్డు, కొత్త ఓటర్ లిస్టు ప్రకారం ఎపిక్ కార్డును అందించాలన్నారు. ఏ, బీ ఫామ్‌లు సరైన విధంగా అందించని వారిని ఇండిపెండెంట్‌గా గుర్తిస్తామని చెప్పారు. నామినేషన్లు వేసిన నాటి నుంచి అభ్యర్థుల ఎన్నికల ఖర్చు మొదలవుతుందని తెలిపారు. రూ. 20 వేల బిల్లు దాటితే వారు అకౌంట్ ద్వారా చెల్లింపులు ఉండాలని సూచించారు.

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

ఎన్నికల సమయం కావడంతో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఉండేందుకు సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కేంద్ర బలగాలు ఉపయోగించి సమస్యాత్మక ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా జరిగేలా చూస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,158 మందిని బైండోవర్ చేశామని, లైసెన్స్ తుపాకులను వెనక్కి తీసుకున్నామన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత మాట్లాడుతూ ప్రజలు వెరిట్ యాప్ ద్వారా అక్రమ లిక్కర్‌ను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత తెలిపారు. అక్రమ మద్యం తరలిస్తున్నట్లు అనుమానం వస్తే టోల్ ఫ్రీ నెంబర్ స్టేట్ 18004252523, జిల్లా 08554–222611 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

ఎన్నికల ఖర్చు లెక్క పక్కాగా ఉండాలి



మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకుడు విజయ్ నెట్కే, కలెక్టర్, ఎస్పీ

- వ్యయ పరిశీలకుడు విజయ్ నెట్కే

దురాజ్‌పల్లి (సూర్యాపేట): శాసనసభ ఎన్నికల సందర్భంగా పోటీలో ఉండే అభ్యర్థుల ఎన్నికల ఖర్చు లెక్కలు పక్కాగా ఉండాలని, బ్యాంక్, డిజిటల్ లావాదేవీలపై ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల వ్యయ పరిశీలకుడు విజయ్ నెట్కే సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, బ్యాంక్ లావాదేవీల కేంద్రం, ఇంటిగ్రేటెడ్ ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు, ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకలతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలోని అన్ని చెక్ పోస్టుల్లో పటిష్ట నిఘా ఉంచాలని, ప్రతి వాహనాన్ని పరిశీలించాలని తెలిపారు. అక్రమంగా తరలించే మద్యం, నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, ఆబ్కారీ పర్యవేక్షకులు అనిత, నోడల్ ఆఫీసర్ సతీష్ కుమార్, డీఎస్పీ నాగభూషణం, డీపీఆర్ఓ రమేష్ కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్వో కార్యాలయం సందర్శన

భానుపురి (సూర్యాపేట): ఆర్వో కార్యాలయాన్ని సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు విజయ్ నెట్కే శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లపై స్థానిక ఎన్నికల అధికారి వీరబ్రహ్మాచారితో చర్చించారు. ఆయన వెంట తహసీల్దార్లు శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య, రంగారావు, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలు నమోదు చేయాలి

తుంగతుర్తి: ఎన్నికల సమయంలో అభ్యర్థులు చేసే ఖర్చు వివరాలను సేకరించి నమోదు చేయాలని ఎన్నికల పరిశీలకులు విజయ్ నెట్కే అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో ఎన్నికల ఖర్చు వివరాలపై సమీక్ష నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల రోజు వారీ ఖర్చు వివరాలు సేకరించి రికార్డు చేయాలని తెలిపారు.

మార్పు కోసమే ఎన్నికల యుద్ధం

- ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

భానుపురి (సూర్యాపేట): రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల్లో మార్పు కోసమే ధర్మసమాజ్ పార్టీ ఎన్నికల యుద్ధంలో నిలిచిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సూర్యాపేట కొత్తబస్టాండ్ వద్ద నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికలంటే పండుగ కాదని.. అట్టడుగు వర్గాలను పైకి తీసుకొచ్చేందుకు దక్కే సువర్ణ అవకాశమన్నారు. తెలంగాణ సంపద మొత్తం మూడు, నాలుగు కులాల వద్దే ఉందని, 90 శాతం ఉన్న బడుగు, బలహీన వర్గాలకు చేరడం లేదన్నారు. ఆంధ్రవాళ్లకు తెలంగాణలో చోటు లేదన్న వారికి.. నేటి తెలంగాణలో దొరలకు ఏం పని అని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చింది పేద ప్రజలకు మేలు జరిగేందుకని.. ఆ మేలు జరగకుండా దొరలు ఓట్లను కొనుగోలు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను పేదలుగా మిగుల్చుతున్నారని ఆరోపించారు. సూర్యాపేట నియోజకవర్గం నుంచి ధర్మసమాజ్ పార్టీ తరఫున అభ్యర్థి కిరణ్‌కుమార్‌కు ఈ ఎన్నికల్లో అవకాశం కల్పించి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్రకులాలను తరిమికొట్టాలి

తుంగతుర్తి: అగ్రకులాల నాయకులను నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 10 శాతం ఉన్న రెడ్డి, వెలమలకు రాజ్యం, 90శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు బానిసలుగా ఉన్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బహుజనులంతా ఏకమై రాజ్యాధికారాన్ని సాధించుకోవాలన్నారు. రాష్ట్రంలో ధర్మ సమాజ పార్టీ అధికారంలోకి వస్తే రూ.33 వేల కోట్లతో ప్రతి గ్రామంలో కార్పొరేట్ స్థాయి ఆస్పత్రులు, పాఠశాలలను స్థాపించి కేజీ టు పీజీ ఉచిత విద్యను అందిస్తామని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి బాలస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయరామరాజు, శ్రీకాంత్, సందీప్, అనుదీప్, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నివేదిక అందించాలి

- అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు 80 సంవత్సరాల వృద్ధులు, వికలాంగులకు ఫాం- 12 డీ ద్వారా పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్‌కు ఎన్నికల విధులు నిర్వహించే వారు, స్పెషల్ ఓటర్లు, సర్వీస్ ఓటర్లు కూడా అర్హులని పేర్కొన్నారు. నియమించిన నోడల్ అధికారులు ఆయా నియోజకవర్గాల వారీగా వృద్ధులకు, వికలాంగులకు ఫాం–12డీ రోజు వారి వివరాలను అందించాలని సూచించారు. ఈ నెల 8 వరకు చివర అవకాశమని, పూర్తి చేసిన ప్రతులు ఆయా నియోజకవర్గ పరిధిలో అందించాలని చెప్పారు. సమావేశంలో సీపీఓ వెంకటేశ్వర్లు, డీటీహెచ్ఓ శంకర్, డీఈఓ అశోక్, మత్స్యశాఖ అధికారి రూపేందర్ సింగ్, డీఎంహెచ్ఓ డా. కోటాచలం, ఆర్‌టీఓ వెంకట్‌రెడ్డి, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

5న ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్

హుజూర్‌నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్, ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ ఆజాం బాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14, 17 ఏళ్ల లోపు బాల బాలికలకు పట్టణంలోని వీవీఎం హైస్కూల్‌లో ఈ టోర్నమెంట్, సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనే పాఠశాల విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరించిన పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి మెమోతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9440829053, 9912296412 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పింఛన్లకు, పంచాయతీ పన్నులకు లింక్

- పోలీస్‌స్టేషన్‌కు చేరిన వివాదం

చిలుకూరు: పింఛన్ డబ్బులకు, గ్రామ పంచాయతీ పన్నులకు లింక్ పెట్టడంతో పంచాయతీ కార్యదర్శికి, పింఛన్‌దారులకు వివాదం నెలకొంది. చివరకు ఈ పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఈ సంఘటన చిలుకూరు మండలంలోని సీతారాంపురం గ్రామంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీతారాంపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రతి నెల మాదిరిగానే ఈ నెల కూడా పింఛన్లు పంపిణీ చేపట్టారు. పింఛన్లు ఇచ్చే సమయంలో పంచాయతీ కార్యదర్శి అవినాష్‌రెడ్డి ఇంటి పన్ను డబ్బులు కట్ చేసుకొని మిగతా డబ్బులు ఇస్తున్నాడు. దీంతో గ్రామానికి చెందిన కస్తాల అక్కమ్మ అనే వికలాంగురాలుకు భర్త గోపయ్యకు పింఛన్ పంపిణీ చేసే క్రమంలో వివాదం తలెత్తింది. కార్యదర్శి అవినాష్‌రెడ్డి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గోపయ్యను పోలీసులు తీసుకెళ్లారు. ఆ తరువాత గోపయ్య భార్య అక్కమ్మ కార్యదర్శిపై చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై విచారణ జరుగుతోంది. ఉన్నత స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

• నేలకొరిగిన వరిపైరు



గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నేరేడుచర్ల మండలంలోని కమలానగర్‌లో నేలకొరిగిన వరి పైరు

నూతన ఆవిష్కరణలకు 'చిల్డ్రన్ సైన్స్'

- నేడు జిల్లా స్థాయి పోటీలు
- ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు అర్హులు
- ఇప్పటికే విద్యార్థులను సన్నద్ధం చేసిన ఉపాధ్యాయులు
- ప్రతి పాఠశాల నుంచి ఒక ప్రాజెక్టు
- ఎంపికైతే రాష్ట్రస్థాయికి..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : సమాజంలోని సమస్యల పరిష్కారానికి శాస్త్ర, సాంకేతికత ఆధారంగా నూతన ఆవిష్కరణలను రూపొందించి సామర్థ్యాలను చాటుకునే అవకాశాన్ని నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ విద్యార్థులకు కల్పిస్తోంది. ఇందులో భాగంగా జిల్లా స్థాయి పోటీలను శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తోంది. అందుకు అనుగుణంగా విద్యార్థులను ఉపాధ్యాయులు సన్నద్ధం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6నుంచి10 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఇందులో పాల్గొనడానికి అర్హులు. ఇప్పటికే జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు దీనిపై శిక్షణ ఇచ్చారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు పిల్లలను ఎంపిక చేసి ఒక ప్రాజెక్టు రూపొందించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలి. రిపోర్టులు కూడా తయారు చేయించాలి. పరిసరాల్లో ఉన్న సమస్యలను గుర్తించి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి వాటికి తగిన పరిష్కార మార్గం కనుగొనాలి. దీని వల్ల విద్యార్థులు నిజ జీవితంతో సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించడం, వాటిని అన్వయించుకొని తగిన ప్రణాళికలు రూపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది. జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రజెంటేషన్ శనివారం దురాజ్‌పల్లిలోని ఎంఎస్ఆర్ పాఠశాలలో నిర్వహించనున్నారు.

ప్రధాన అంశం..

డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారిచే ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌లో ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం ప్రధాన అంశం.

ఉప అంశాలు..

- పర్యావరణ వ్యవస్థను తెలుసుకోవడం.
- ఆరోగ్యం, పోషణ, శ్రేయస్సును పెంపొందించడం.
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు
- స్వీయ ఆధారితం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం.
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణలు.

వీటిలో విద్యార్థులు వారి పాఠశాలల్లోని గైడ్ టీచర్ సహాయంతో ఎంచుకున్న అంశానికి అనుగుణంగా సర్వే, పరిశీలన, ప్రశ్నావళి, కేస్ స్టడీస్ ఆధారంగా ప్రాజెక్టులు రూపొందించి రిపోర్టు తయారు చేయాలి. ప్రాజెక్టు రిపోర్టుతో పాటు నాలుగు చార్ట్‌లు తప్పని సరిగా ప్రజెంటేషన్ సమయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఇందులో ప్రాజెక్టు ప్రజెంటేషన్‌కు 6 నిమిషాలు, ప్రాజెక్టుపై ప్రశ్నలకు వైవా 2 నిమిషాలు ఉంటుంది. వీటిలో ప్రతి 15 ప్రాజెక్టుల నుంచి ఒక ఉత్తమమైనదానిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీలు నవంబర్ 2వ వారంలో జరుగుతాయి. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రాజెక్టును జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు ఐఐటీ, ఎన్ఐటీలో రిజర్వేషన్లు కల్పించనున్నారు.

ఉపాధ్యాయులు చొరవ చూపాలి



విద్యార్థులు సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనే విధంగా సైన్స్ ఉపాధ్యాయులు చొరవ చూపాలి. ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపిక చేసి రిపోర్టు తయారు చేయించి దానిని ప్రజెంటేషన్ చేయించే విధంగా రూపొందించాలి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను వెలికి తీయవచ్చు.

– దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి

● ఓటు.. కడక్



ఎన్నికల ప్రచారంలో భాగంగా నీలగిరి పట్టణంలో ఇస్త్రీ చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

● వ్యాన్ ఎక్కిన ఏనుగు

ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీలు తమ గుర్తులను వినూత్న రూపంలో ప్రచారం చేస్తున్నాయి. బీఎస్పీ పార్టీ గుర్తు అయిన ఏనుగును వ్యాన్‌పై అమర్చారు. దూరం నుంచి చూసేవారు నిజంగా ఏనుగు వ్యాన్ ఎక్కిందా అని ఆశ్చర్యానికి లోనవుతున్నారు.

– భువనగిరిటౌన్



వ్యాన్‌పై పెట్టిన ఏనుగు గుర్తు

జంగ్ తెలంగాణ

మూడు స్థానాల్లో బి.వెల్లంల వాసుల పోటీ



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : మండలంలోని బ్రాహ్మణవెల్లంల గ్రామానికి ఓ ప్రత్యేక ఉంది. ఈ గ్రామానికి చెందిన ముగ్గురు నేతలు 2009 నుంచి వివిధ ఎన్నికల్లో పోటీలో ఉంటున్నారు. ప్రస్తుతం వీరు మూడు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారు. వారిలో కాంగ్రెస్ పార్టీ నుంచి కోమటిరెడ్డి సోదరులు నల్లగొండ, మునుగోడు స్థానాల్లో, బీఆర్ఎస్ పార్టీ నుంచి నకిరేకల్‌లో చిరుమర్తి లింగయ్య బరిలో ఉంటున్నారు. వీరు గత ఎన్నికల్లోనూ వీరు ఇవే స్థానాల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. ఈ సారి కూడా ఈ ముగ్గురు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీలో ఉండడం విశేషం.

వీరి రాజకీయ ప్రస్థానం ఇలా..

- బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మొదటి నుంచి రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్నారు. ఆయన 1999 ఎన్నికల్లో నల్లగొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ అక్కడి నుంచే బరిలో నిలిచారు. 2018 ఎన్నికల్లో మినహా మిగతా నాలుగు సార్లు ఆయన గెలుపొందారు. 2019 ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి ఎంపీగా విజయం సాధించారు.
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి భువనగిరి పార్లమెంట్ బరిలో నిలిచి విజయం సాధించారు. 2014లో ఓటమి పాలయ్యారు. తర్వాత స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందారు. అనంతరం 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ తరఫున మునుగోడులో పోటీ చేసి విజయం సాధించారు. 2022లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరి ఉప ఎన్నికలో ఓటమి పాలయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు.
- ఇదే గ్రామానికి చెందిన చిరుమర్తి లింగయ్య 2009 శాసనసభ ఎన్నికల్లో నకిరేకల్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ పార్టీ నుంచి నకిరేకల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు.

జోరుగా ప్రచారం..

ఎన్నికల బరిలో నిలిచిన ఈ ముగ్గురు నేతలు ఆయా నియోజకవర్గంలో వేర్వేరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గతంలో వీరంతా ఒకే పార్టీ నుంచి బరిలో ఉండడంతో ఒకరి గెలుపునకు మరొకరు కృషి చేశారు. కానీ ఈ సారి నకిరేకల్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న చిరుమర్తి లింగయ్య ఓటమికి కోమటిరెడ్డి సోదరులు కృషి చేస్తున్నారు. ఈ ముగ్గుర్గిరి ఎంతమంది ఈ సారి అసెంబ్లీ మెట్లు ఎక్కుతారోనని బ్రాహ్మణవెల్లంల గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

మద్దతు సరిపోతలేదు



ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న రైతులు నేడు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రైతుల రాతలు మాత్రం మారడం లేదు. ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరగడం.. అందుకు తగిన విధంగా ప్రభుత్వాలు మద్దతు ధర పెంచకపోవడంతో నష్టాల పాలవుతున్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ పట్టణ సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో 'సాక్షి' నిర్వహించి పీపుల్స్ ఎజెండాల్లో రైతులు తమ కష్టాలను చెప్పుకున్నారు.

ఆవుల లక్ష్మయ్య, నల్లగొండ టౌన్



కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోస్తున్న రైతులు

పీపుల్స్ ఎజెండా

- ఎరువులు, పురుగు మందుల ధరలు భారీగా పెరిగాయి
- పెట్టుబడికి.. ప్రభుత్వం ఇచ్చే ధరకు పొంతన ఉండడం లేదు
- పంటలు అమ్ముకోవడానికి సైతం అష్టకష్టాలు పడుతున్నాం
- సగం మంది రైతులకే రుణమాఫీ అయ్యింది
- వర్షాల వల్ల పంట నష్టపోతే ప్రభుత్వం పరిహారం చెల్లించాలి

'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో తమ కష్టాలు చెప్పుకున్న రైతులు

ప్రభుత్వం పంటలకు మద్దతు ధర పెంచాలని రైతులు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.4500, పత్తికి రూ.10 వేల వరకు చెల్లించాలని కోరుతున్నారు. సాగు పెట్టుబడులు పెరిగి మోయలేని భారం పడుతోందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అందరికీ రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకుల్లో అప్పులు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద నెలల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు కూడా సకాలంలో రాకపోవడంతో పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఒక్కోసారి ప్రకృతి ప్రకోపానికి గురైన సమయంలో ప్రభుత్వాల నుంచి కనీసం పరిహారం అందక అప్పుల్లో కూరుకుపోతున్నారు. కష్టనష్టాల కోర్చి పంటలు పండించినా అమ్ముకునేందుకు అష్టకష్టాల తప్పడం లేదు. ప్రభుత్వాలు స్పందించి వ్యవసాయ రంగాన్ని కాపాడకపోతే సాగు నుంచి తప్పుకోవడం తప్ప మరో మార్గం లేదని ఆవేదన వెలిబుచ్చారు.



కాంటా వేస్తున్న హమాలీలు

రుణమాఫీ అమలు చేయాలి



ప్రభుత్వం ఇప్పటి వరకు సగం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదు. దీంతో బ్యాంకుల్లో తీసుకున్న అప్పు రెండింతలు అయ్యింది. రుణమాఫీ వస్తుందన్న ఆశతో అప్పు కట్టలేదు. ఇప్పటికీ రుణమాఫీ కాలేదు. వెంటనే ప్రభుత్వం రుణమాఫీని చేసి ఆదుకోవాలి.

– బొద్దుపల్లి నగేష్

వెంట వెంటనే కొనుగోలు చేయాలి



ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నాం. రోజూ రాశులు ఎండబెట్టి, కుప్పలు దగ్గర పోస్తున్నాం. వ్యవసాయ పనులు మానేసి వడ్ల కుప్పల వద్ద కాపలా ఉంటున్నాం. వెంటనే కొనుగోలు చేస్తే ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

– జిల్లేపల్లి ఆండాలు

పెట్టుబడి కూడా రావడం లేదు



ఈ సారి వరిచేలకు తెగులు వచ్చి వడ్లు బాగా పండలేదు. అమ్ముకుంటే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి ముందుకు వచ్చి పరిహారం చెల్లించాలి. వడ్లు అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో ఎదురు చూడాల్సి వస్తోంది.

– పనస స్వరాజ్యం

వర్షం వస్తే వడ్లు మొలకెత్తుతాయి



పంటలు కోసి కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చాం. ఇప్పుడు మబ్బులు పడుతున్నాయి. వర్షం వస్తే వడ్లు తడిసి మొలకెత్తే ప్రమాదం ఉంది. కొనుగోళ్లు వెంటవెంటనే చేపట్టపోవడంతో పొద్దస్తమానం కుప్పల వద్ద కాపలా ఉండాల్సి వస్తోంది.

– జిల్లేపల్లి పద్మ

పెట్టుబడులు పెరిగాయి



ప్రస్తుతం వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల ధరలు బాగా పెరిగాయి. దున్నకాలు రేట్లు కూలీల ఖర్చు కూడా పెరిగింది. పంటలు సాగు చేస్తే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– జానపాటి రాజేంద్రప్రసాద్

క్వింటాకు రూ.4500 చెల్లించాలి



ప్రభుత్వం ధాన్యం, పత్తికి ఇస్తున్న మద్దతు ధర ఏ మూలకూ సరిపోవడం లేదు. నేడు అన్నింటికీ ధరలు పెరిగాయి. ప్రస్తుతం ఉన్న మద్దతు ధరలతో పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం ధాన్యం క్వింటాకు రూ.4500, పత్తికి రూ.10 వేల మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలి.

– ద్యైద వెంకట్‌రెడ్డి

బోనస్ ఇవ్వాలి



అతివృష్టి వచ్చినా అనావృష్టి వచ్చినా నష్టపోయేది రైతులు మాత్రమే. ఇప్పుడు పంటల పెట్టుబడులు వెళ్లక అప్పుల పాలవుతున్నాం. ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ కూడా కలిపి ఇవ్వాలి. రైతులను ఆదుకోవడానికి పాలకులు చొరవ తీసుకోవాలి.

– పనస కాశయ్యగౌడ్

అష్టకష్టాలు పడుతున్నాం



ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అమ్ముకోడానికి అష్టకష్టాలు పడుతున్నాం. నెల రోజుల వరకు కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. పట్టాల ఖర్చు, కూలీ ఖర్చు భారంగా మారుతోంది. వెంటవెంటనే కాంటాలు వేసేలా చూడాలి.

– కేశబోయిన క్రిష్ణయ్య

మంత్రి జగదీష్‌రెడ్డి కాన్వాయ్ తనిఖీ



మంత్రి జగదీష్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

సూర్యాపేట : రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ముమ్మరంగా తనిఖీలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కాన్వాయ్‌ని సూర్యాపేట సమీపంలోని విజయవాడ –హైదరాబాద్ జాతీయ రహదారిపై చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి పోలీసులకు మంత్రి జగదీష్‌రెడ్డి పూర్తిగా సహకరించారు. మంత్రి వాహనంతో పాటు వెంట ఉన్న ఇతర వాహనాలను సైతం పోలీసులు తనిఖీ చేశారు.

గజ్వేల్‌లో మంచ్యాతండా వాసి నామినేషన్

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండాకు చెందిన ఉస్మానియా జేఏసీ నాయకుడు, మఠంపల్లి మండల భూపరిరక్షణ సమితి అధ్యక్షుడు సపావట్ సుమన్‌నాయక్ శుక్రవారం గజ్వేల్‌లో నామినేషన్ దాఖలు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మఠంపల్లి మండలంలోని గుర్రంబోడుతండా 540 సర్వే నంబర్‌లో గల గిరిజనుల భూ సమస్యలను పరిష్కరిస్తానని హుజూర్‌నగర్ ఉప ఎన్నిక సమయంలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి ఇప్పటి వరకు చేయలేదన్నారు. తాను గతంలో కూడా తెలంగాణలోని పలు అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు వేసినట్లు తెలిపారు.



గజ్వేల్ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేస్తున్న సుమన్‌నాయక్

దివ్యాంగులకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జలాల్‌పురంలోని స్వామిరామానంద తీర్థ గ్రామీణ సంస్థలో శారీరక వికలాంగులైన యువతీ, యువకులకు పలు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సాయిలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ అండ్ మెయింటెనెన్స్(సెల్‌ఫోన్) కోర్సుకు పదో తరగతి, డీటీపీ అండ్ ప్రింటింగ్ పబ్లిషింగ్ అసిస్టెంట్ ఇంటర్మీడియట్, అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు బీకామ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, జర్దోజీ కోర్సుకు 8వ తరగతి విద్యార్హత కల్గి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాలని అన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్స్, పాస్‌పోర్ట్ ఫోటోలు, ఆధార్‌కార్డు జీరాక్స్, ఒర్జినల్ కాపీలను వెంట తీసుకొని ఈ నెల 15న 10 గంటలకు సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావలెనని కోరారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111, 9133908222 ఫోన్ నంబర్లు సంప్రదించాలని కోరారు.

గొర్రెల అపహరణ

భూదాన్‌పోచంపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు మందలో నుంచి 7 గొర్రెలను అపహరించుకొని వెళ్లారు. ఈ ఘటన భూదాన్‌పోచంపల్లి మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. బాధితుడు దుర్గం శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోజు మాదిరిగానే గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గలమందలో గొర్రెలు, మేకలను తోలాడు. ఉదయం తిరిగి మంద వద్దకు వెళ్లి చూడగా గొర్రెలు చోరీకి గురైనట్లు గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ విక్రమ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. గ్రామంలో గల సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించగా సుమారు అర్ధరాత్రి 12.56 గంటల సమయంలో నంబర్ లేని కారులో వచ్చిన దుండగులు గొర్రెలను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

చౌటుప్పల్ : ఉరివేసుకొని ఓ వివాహిత మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం పట్టణంలోని విద్యానగర్‌కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పాశంవారిగూడెం గ్రామానికి చెందిన పాశం నర్సింహారెడ్డి కుటుంబంతో కలిసి పట్టణంలో నివాసం ఉంటూ స్థానికంగా ఓ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. నర్సింహారెడ్డికి భార్య కల్పన(35)తో పాటు కుమారుడు ఉన్నాడు. కొద్ది రోజుల క్రితం వారి కుమార్తెఅనారోగ్యంతో మృతి చెందింది. దీంతో అప్పటి నుంచి తల్లి కల్పన మానసిక వేదనకు గురవుతుంది. ఈ క్రమంలో భర్త కంపెనీకి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో కల్పన ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

హుజూర్‌నగర్ : భయభ్రాంతులకు గురిచేస్తున్న మఠంపల్లి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన పలువురు శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జగదీశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎన్నికల రిటర్నింగ్ అధికారి జగదీశ్వరరెడ్డిని సంప్రదించగా ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని తెలిపారు. ఫిర్యాదు కాపీని కలెక్టర్, ఎన్నికల అధికారి, ఎస్పీకి పంపినట్లు తెలిపారు. కాగా ఫిర్యాదు కాపీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

సంస్థాన్ నారాయణపురం: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన సింగపంగ వినోద్‌కుమార్(22) డెకరేషన్ పనులు చేస్తుంటాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తిరిగి వచ్చే సరికి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఆవు దాడిలో మహిళ మృతి

కొండమల్లేపల్లి : ఓ మహిళపై ఆవు దాడి చేయడంతో దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. మండలంలోని వద్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని కారోబార్‌తండాకు చెందిన నేనావత్ అంబాలి(52) రోజుమాదిరిగా తన పశువుల మందను పొలానికి తీసుకెళ్తుంది. ఆ మందలోని ఓ ఆవు రెండు రోజుల క్రితం దూడకు జన్మనిచ్చింది. శుక్రవారం అంబాలి దూడను పట్టుకునే క్రమంలో పక్కనే ఉన్న ఆవు బలంగా పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

కార్తీకమాసంలో పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

● నల్లగొండ రీజియన్ మేనేజర్ ఎస్.శ్రీదేవి

భానుపురి, నల్లగొండ రూరల్ : కార్తీకమాసం సందర్భంగా ఉమ్మడి జిల్లావాసులకు పలు క్షేత్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు నల్లగొండ రీజియన్ మేనేజర్ ఎస్.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ నుంచి పంచారామాలు (5పుణ్య క్షేత్రాలు), డెక్కన్ శైవక్షేత్రాలు (5 పుణ్యక్షేత్రాలు), అరుణాచలం, శబరిమలకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు డిపోల నుంచి ఈ బస్సులు ఉంటాయని తెలిపారు. దేవరకొండ నుంచి పంచరామాలకు 12 బస్సులు, శబరిమలకు 4 బస్సులు, అరుణాచలంకు 3 బస్సులు డెక్కన్ శైవక్షేత్రానికి 3 బస్సులు, నల్లగొండ నుంచి పంచారామాలకు 15 బస్సులు, శబరిమలకు 2 బస్సులు, అరుణాచలంనకు 3 బస్సులు, డెక్కన్ శైవక్షేత్రానికి 3 బస్సులు, నార్కట్‌పల్లి నుంచి పంచారామాలకు 2 బస్సులు, శబరిమల, అరుణాచలంకు ఒక్కొక్కటి ఉంటాయని తెలిపారు. అదే విధంగా డెక్కన్ శైవక్షేత్రానికి 2 బస్సులు, మిర్యాలగూడ నుంచి పంచరామాలకు 14, శబరిమలకు 4, అరుణాచలంనకు 3, డెక్కన్ శైవక్షేత్రానికి 2, యాదగిరిగుట్ట నుంచి పంచారామాలకు 8, శబరిమలకు 2, అరుణాచలానికి 2, డెక్కన్ శైవక్షేత్రానికి 3, కోదాడ నుంచి పంచరామాలకు 8, శబరిమలకు 2, అరుణాచలంనకు 3, డెక్కన్ శైవక్షేత్రానికి 3, సూర్యాపేట నుంచి పంచరామాలకు 11 బస్సులు, శబరిమలకు 5 బస్సులు, అరుణాచలంనకు 3 బస్సులు, డెక్కన్ శైవక్షేత్రానికి 4 బస్సుల చొప్పున నడుపుతున్నామని తెలిపారు.

విదేశీయుల సందర్శన

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలోని టెక్స్‌టైల్ పార్కులోని మిమిక్రాఫ్ట్స్ యూనిట్‌ను శుక్రవారం అమెరికా దేశస్తులు సందర్శించారు. వారిని డిజైనర్ కె.కృష్ణమూర్తి, నిర్వాహకురాలు పుష్పలత ప్రాచీన హస్తకళల నవీకరణను వివరించారు. ప్రాచీన హస్తకళలకు సంబంధించిన వస్త్రాలను నూతన డిజైన్‌లతో మిమిక్రాఫ్ట్ విధానంలో తయారు చేస్తుండడాన్ని విదేశీయులు కొనియాడారు. నూతన డిజైన్‌లతో వస్త్రాలను రూపొందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇవియా, టాడ్ పిమెండస్, పిశ్చర్ తదితరులు పాల్గొన్నారు.



డిజైన్‌లను పరిశీలిస్తున్న విదేశీయులు

గంజాయి తాగుతున్న ఏడుగురు యువకుల అరెస్ట్

కోదాడరూరల్ : గంజాయి తాగుతున్న ఏడుగురు యువకులను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని దోరకుంట గ్రామానికి చెందిన పలువురు యువకులు గ్రామశివారులో గంజాయి తాగుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఏడుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఆర్థిక పరిస్థితులు బాగోలేక చదువు మధ్యలో మానేసి గంజాయికి అలవాటుపడినట్లు ఒప్పుకున్నారని ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

భద్రాచలంలో కొనుగోలు చేసి..

గ్రామానికి చెందిన మధు, నితీష్, సమీర్, కిశోర్‌లు వినాయకచవితి ముందు స్నేహితుడి ఆటోలో భద్రాచలం వెళ్లి అక్కడ ఓ వ్యక్తి వద్ద 4కేజీల గంజాయిని రూ.6వేలకు కొనుగోలు చేశారు. గంజాయిని గ్రామశివారులో గల ఓ సెల్‌టవర్ వద్ద దాచిపెట్టారు. గ్రామానికి చెందిన రాకేష్, నితీష్, రమేష్ 2కేజీలను కొనుగోలు చేయగా మిగిలిన రెండు కేజీల గంజాయిని గ్రామశివారులోనే ఉంచి జగ్గయ్యపేటకు చెందిన గోపితో కలిసి రోజు అక్కడికి వెళ్లి విల్స్‌క్లాసిక్ సిగరేట్‌లలో పెట్టుకొని తాగుతున్నట్లు తెలిపారు. వారి వద్ద 1.250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.